క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: బుక్కరాయసముద్రం చెరువు కట్టపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. అయ్యప్ప మాలధారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా జీవించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

పుట్లూరు: గ్రామాల్లో గొడవ జోలికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని అధికారులు ప్రజలకు సూచించారు. శనగలగూడూరులో శనివారం డీఎస్పీ వెంకటశివారెడ్డి, తహసీల్దార్ మోహన్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొంత కాలంగా ఇరు వర్గాలకు నెలకొన్న వివాదంపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న వాతవరణం కొనసాగడానికి అందరూ సహకరించాలని సూచించారు. అనంతరం సమస్య పరిష్కారం కోసం ఇరువైపులా పెద్దలతో చర్చించారు. ఎస్‌ఐ దిలీప్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 21,22వ వార్డుల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లో డ్రైనేజీ కాలువలను పరిశీలించారు.తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. అనంతరం కమిషనర్ గాంధీ సర్కిల్ వద్ద నుంచి కర్నూల్ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోటళ్లను తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, శానిటేషన్‌ను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్: ప్రతి ఒక్క విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, సాఫ్ట్‌వేర్ కంపెనీ ట్రైనర్ సాకే యశ్వంత్ పేర్కొన్నారు. శనివారం కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో వారు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే ఏఏ కోర్సులు చేయాలి? ఉద్యోగ నియామకాల ఇంటర్వ్యూల్లో ఎలా రాణించాలనే అంశాలపై వివరించారు. అధ్యాపకులు జనార్దన్ శాస్త్రి, రవిశంకర్ శర్మ, కిశోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పని తీరుపై అవగాహన



ఈవీఎం పనితీరును వివరిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

శింగనమల: తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఈవీఎంల పనితీరుపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాల అవగాహన కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఓటర్లు ఈవీఎంల పనితీరు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులను అందిస్తున్న డీఎం

తాడిపత్రి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండులో అధికారులు శనివారం లక్కీడిప్ విజేతలకు బహుమతులు అందజేశారు. తాడిపత్రి–ధర్మవరం రూటు ప్రయాణికులు తాడిపత్రికి చెందిన ఐ.స్రవంతి, కామిరెడ్డిపల్లికి చెందిన టి.వెంకటరమణమ్మ, ధర్మవరానికి చెందిన కృష్ణారెడ్డి లక్కీడిప్‌లో విజేతలుగా నిలిచారు. వారికి డీఎం శంకర్,అసిస్టెంట్ డీఎం నందిని బహుమతులు అందించారు.

బడుగులే పార్టీకి పట్టుగొమ్మలు

- 9న గుంతకల్లులో సామాజిక సాధికార యాత్ర
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి
- యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపు



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో చర్చిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



తొండపాడులో మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

గుంతకల్లు టౌన్: బడుగు, బలహీన వర్గాలు వైఎస్సార్‌సీపీకి పట్టుగొమ్మలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లోనూ పెద్ద పీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ నెల తొమ్మిదో తేదీన గుంతకల్లులోని వైఎస్సార్ సర్కిల్‌లో సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్నారు. యాత్ర ఏర్పాట్లను పరిశీలించేందుకు మంత్రి పెద్దిరెడ్డి శనివారం గుంతకల్లుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నివాసంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, వారి ఆర్థిక పరిపుష్టికి సీఎం జగన్ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని స్పష్టం చేశారు. సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సాధికారత దిశగా నడిపించిన వైనాన్ని ప్రజలకు వివరించేందుకే సామాజిక సాధికార బస్సుయాత్రను చేపడుతున్నట్లు చెప్పారు. సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని ఆయన నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, జోనల్ చైర్‌పర్సన్ మంజుల, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యువ నేత సి.బి.మంజునాథరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజినేయులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గాదిలింగేశ్వరబాబు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సుంకప్ప, మోహన్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం

గుత్తి రూరల్: తొండపాడు వద్ద రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పార్టీ నాయకులు శనివారం ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా పలువురు మంత్రిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. జెడ్పీ చైర్ పర్సన్ బోయగిరిజమ్మ, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మునిసిపల్ చైర్ పర్సన్ వన్నూరుబీ, వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, యువనేత మంజునాథ్ రెడ్డి, బళ్లారిరాజ్‌కుమార్ రెడ్డి, క్రషర్ మధు, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు హుసేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరా ఉన్నారు.

తాడిపత్రి అర్బన్: బొందలదిన్నె గ్రామ సమీపంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతల నుంచి ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా, రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

'నేరాలు చేసేందుకే పెద్ద చదువు చదివావా జేసీ'



మాట్లాడుతున్న మురళీ ప్రసాద్‌రెడ్డి

తాడిపత్రి: నేరాలు చేసేందుకే పెద్ద చదువు చదివావా అంటూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చింతలరాయుడి ఆలయ చైర్మన్ కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చదువు గురించి మాట్లాడటమంటే రెండు లక్షల మంది ఓటర్లను కించపర్చడమేనన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ.6 కోట్లు చెల్లించాలంటూ ఇటీవల ఏవో పేపర్లు పెట్టుకుని జేసీ మాట్లాడారని, ఆ డబ్బు ఎమ్మెల్యేకు ఎవరిచ్చారో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇప్పటికే జగనన్న ప్రభుత్వం రూ.3 కోట్లు రీఫండ్ చేసిందని, మిగతా మొత్తాన్ని ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. టిడ్కో ఇళ్ల ముట్టడికి రావాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చిన జేసీ ఎందుకుపై ఈ విషయాలను ఎందుకు దాచారో ప్రజలు ఆలోచించాలన్నారు. జనవరిలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వనున్న నేపథ్యంలో జేసీ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సజ్జలదిన్నె వద్ద 600 మందికి ఇళ్లు నిర్మించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదని, అందులో ఎమ్మెల్యే పెద్దారెడ్డి కృషి మరువలేనిదన్నారు. అధికారంలోకి వస్తే వాటిని పడగొడతాం అంటూ వ్యాఖ్యలు చేస్తున్నావంటే పేదలు బాగుపడడం ఇష్టం లేదా జేసీ అంటూ నిలదీశారు.

భూములను కాజేసే తెలివిని నీ చదువే నేర్పిందా...

గతంలో సజ్జలదిన్నెకు చెందిన గ్రామస్తులు తాడిపత్రి మున్సిపాలిటీ కోసం దాదాపు 70 ఎకరాలు దానం చేస్తే, ఆ భూమిని నీ పెట్రోల్ బంకులో పని చేసే వ్యక్తి మీద 50 ఎకరాలు రాయించావా లేదా జేసీ అని ప్రశ్నించారు. 50 ఎకరాల్లో పెరిగిన కంప తొలగించినందుకు రూ.3 లక్షలు బాడుగ చెల్లింపు కోసం నీ క్లీనర్ పేరు మీద 25 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించావా లేదా అని ప్రశ్నించారు. దీనిపై తాము కోర్టులో కేసులు వేయగా, వాటిని ఎందుకు రద్దు చేశావని ప్రశ్నించారు. అప్పటి న్యాయమూర్తి ఎన్వీ రమణ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కమిషనర్‌ను మందలిస్తే, 2012 అక్టోబర్‌లో తిరిగి అప్పటి కమిషనర్ రామ్మోహన్‌రెడ్డి పేరిట చేయించడం వాస్తవమా కాదా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ విషయంలో చర్చకు సిద్ధమైతే ఆధారాలతో వస్తానని సవాల్ విసిరారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ బాబు, గడ్డం పరమేష్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం అంబులం పూజను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సాయంత్రం పట్టణ వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గురుస్వామి పామిడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో, భక్తుల శరణుఘోషలతో ఊరేగింపు సాగింది. అనంతరం మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



గుంతకల్లులో లబ్ధిదారుకు వివరిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పనులు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ మెగా కంప్లీషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం 12వ సచివాలయం పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన ఆయన నిర్మాణ పనుల్లో జాప్యానికి గల కారణాలను ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వమందించే బిల్లులు, సామగ్రి, పొదుపు సంఘాల సభ్యులకు అందించే రుణంపై వివరించారు. సీనియర్ అసిస్టెంట్ భరత్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని నేమతాబాద్ జగనన్న లే అవుట్‌ను శనివారం స్పెషలాఫీసర్ రవి నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఈయన ఇళ్లను పరిశీలించి నిర్మాణాలను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

యాడికి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజనీర్ల అసిస్టెంట్లు, వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వచ్చే జనవరి నెల 30లోపు గృహాలను పూర్తి చేయించాలని చర్యలు తీసుకోవాలన్నారు.హౌసింగ్ ఏఈ ప్రశాంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ మద్దతుదారులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆలూరు రమణారెడ్డి

బుక్కరాయసముద్రం: జన చైతన్య నగర్ కాలనీ, హమాలీ కాలనీకు చెందిన 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. శనివారం వారికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సాంబశివుడు, చికెన్ నారాయణస్వామి, బుల్లే రాజా, శేషానందరెడ్డి, లక్ష్మీనారాయణ, నూర్ మహమ్మద్, అంజి, సర్దార్, బాబా, రమణ, ప్రభాకర్, టిప్పు, చక్రి, రఫి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి ఆర్థికసాయం:

విరూపాక్షేశ్వర నగర్ కాలనీలో గృహసారథిగా పని చేస్తున్న తలారి నాగరాజు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆలూరి రమణారెడ్డి, నాయకులు నాగరాజు కుటుంబాన్ని పరామర్శించారు. నాగరాజు కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



మొక్కకు నీరు పోస్తున్న బంజారా ఫౌండేషన్ సభ్యులు

గుత్తి రూరల్: మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని బంజారా ఫౌండేషన్ చైర్మన్ కమల్‌సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. శనివారం సేవాగఢ్‌లో ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ ఆవరణలో బంజారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమల్ సింగ్ రాథోడ్ మాట్లాడుతూ కాలుష్య నివారణ, నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణ, వృక్షాలను కాపాడటం, ప్లాస్టిక్ నివారించడం వలన పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయన్నారు. దేశ రాజధాని ఢిల్లీ, వాణిజ్య రాజధాని ముంబై లాంటి మహానగరాలు నేడు వాయు, శబ్ద కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయన్నారు. ఏసీ, ఫ్రిడ్జ్, వాహనాల ఉద్గారాలు, ఎల్రక్టానిక్ సామగ్రి వలన వెలువడే క్లోరోఫ్లోరో కార్బన్ ఓజోన్ పొరను నాశనం చేస్తున్నాయన్నారు. ఫౌండేషన్ సభ్యులు తారాచంద్, లతా రాథోడ్, పద్మినిబాయి, శర్మన్‌చౌహాన్, రాజేష్, రవితేజ పాల్గొన్నారు.

'ఆడుదాం.. ఆంధ్రా'లో పాల్గొనండి



రజాపురంలో క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రాపై వివరిస్తున్న రాజశేఖరరెడ్డి

గుత్తి రూరల్: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం రజాపురం గ్రామంలో ఆడుదాం ఆంధ్రా పోటీలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులకు ప్రభుత్వం క్రీడా పరికరాలు ఇచ్చి ప్రొత్సహిస్తోందన్నారు. గ్రామీణ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షలకు పైగా పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఐటీ వింగ్ సభ్యులు జ్ఞానేశ్వరరెడ్డి, పవన్‌కుమార్, నారప్ప పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణ ఎంఈఓలకు సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన ఎంఈఓ 2, పీడీ, పీఈటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు నెలన్నర పాటు జరగనున్న ఆటల పోటీల్లో ఖోఖో, కబడ్డీ, పరుగు పందెం తదితర పోటీలను నిర్వహించాలన్నారు.

పామిడి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు సమన్వయంతో కార్యకమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోండి



బీకేఎస్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి సుధారాణి



గుత్తిలో బీఎల్‌ఓలతో ఓటరు నమోదుపై ఆరా తీస్తున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

బుక్కరాయసముద్రం: అర్హత ఉన్న ఉన్న ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారిణి సుధారాణి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ముందుగా మండలంలో ఎంత మంది బీఎల్‌ఓలు ఉన్నారని ఎన్ని పంచాయతీలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. తహసీల్దార్ రమాదేవి, వీఆర్‌ఓలు ఓబిలేసు, అయ్యప్ప పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో అన్ని పోలింగ్ స్టేషన్‌లో శనివారం ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 50 పోలింగ్ స్టేషన్‌లో 76 మంది కొత్తగా ఓటరు నమోదు ,17 మంది ఓటరు జాబితా నుంచి పేరు తొలగించాలని, 13 మంది ఓటరు జాబితా సవరణ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ డ్రైవ్ ఉంటుందని తెలిపారు.

గుత్తి రూరల్: మునిసిపాలిటీతో పాటుగా మండల వ్యాప్తంగా తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలని తహసీల్దార్ మహబూబ్ బాషా బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం కొత్తపేట, తొండపాడు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సందర్శించారు. బూత్‌లతో ఉన్న బీఎల్‌ఓలకు పలు సూచనలు ఇచ్చారు. ఆదివారం కూడా మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌లతో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని ఓటర్లు తప్పులు, మార్పులు, చేర్పులు, నూతన ఓటరు నమోదు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలపారు. బీఎల్‌ఓలు మన్సూర్, రంగయ్య, విశ్వేష్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: ఓటరు నమోదు, అభ్యంతరాల స్వీకరణపై శనివారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా సాగింది. రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్, సరోజినినాయుడు గర్ల్స్‌హైస్కూల్స్‌లోని పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు పక్కాగా నిర్వహించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఆర్‌ఐ ఎర్రిస్వామి ఉన్నారు.

యల్లనూరు: ఓటర్లు ఓటరు జాబితాను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని మండల స్పెషలాఫీసరు ఫిరోజ్‌ఖాన్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియపై బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ఎంపీడీఓ వీరరాజు, హౌసింగ్ ఏఈ సుప్రజ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలో శనివారం జరిగిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ నాగభూషణం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విరుపాపురం గ్రామంలోని పోలింగ్ బూత్‌లో బీఎల్‌ఓలు అర్జీలు స్వీకరిస్తున్న తీరును గమనించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్వో లక్ష్మీపతి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బలిజల కార్తీక వన భోజనం

గుత్తి: పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న సునామ జకినీ మాత ఆలయంలో ఆదివారం బలిజల కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సీనియర్ నాయకులు బండి సత్య, పులికొండ, నాగయ్య తదితరులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ఆర్‌ఎస్‌లోని అయ్యప్ప ఆలయం వద్ద నుంచి సునామ జకినీ మాత ఆలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. బలిజ కులబాంధవులందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

యాడికి: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి పరమేశ్వర్ తెలిపారు. కుందనకోట గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పరమేశ్వర్ 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

ప్రత్యామ్నాయ పరిశ్రమలు నెలకొల్పాలి

గుంతకల్లుటౌన్: మూతపడిన ఆంధ్రా కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు స్థలంలో ప్రత్యామ్నాయ పరిశ్రమలు నెలకొల్పాలని డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, చరణ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మిల్లు ఎదుట డీవైఎఫ్‌ఐ నాయకులు నిరసన తెలిపారు. నాయకులు సురేంద్ర, మురళీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గార్లదిన్నె: ఇల్లూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8 మంది విద్యార్థులు చిత్ర లేఖనం పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ ఆర్ట్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్‌కృష్ణ శనివారం తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 10న ముంబయికు చెందిన రంగోత్సవం సెలబ్రేషన్స్ వారు ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి పోటీలు నిర్వహించగా పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో అరుణ, వైష్ణవి, ప్రశాంత్ రాజు, చరిత, రాఘవేంద్ర, రేఖ, నాని, అమీర్‌బాషా బంగారు పతకాలు సాధించారన్నారు. ఈసందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులతోపాటు ఆర్ట్ టీచర్ గురుస్వామిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి పనులపై 'ప్రజావేదిక'

పెద్దవడుగూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 16వ సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం సజావుగా సాగింది. ఈసందర్భంగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలో వెల్లడైన అంశాలను చదివి వినిపించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈఏడాది మార్చి ఆఖరు వరకూ మండలంలో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ శాఖల ద్వారా వివిధ పనులకు రూ.16.44 కోట్లు ఖర్చు చేసినట్లు తెలియజేశారు. ఇందులో దాదాపు రూ.18,704 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. వాటిని బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఏపీడీ వాటర్‌షెడ్ సుధాకర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ మధుసూదన్, డివిఒ సెక్షన్ అధికారి పర్వేష్ ఆదేశాలు జారీ చేశారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి తెలిపారు. ఏపీఎం ఈశ్వరయ్య, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంటు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గుత్తి రూరల్: ఇసురాళ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొర్రా పెద్దనాగిరెడ్డి(65) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగిరెడ్డి కుమారుడు పుల్లారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. సర్పంచ్ వాసుదేవరెడ్డి, కౌన్సిలర్ నరేష్, నాయకులు బేడల వెంకట్రాముడు, రంగస్వామి, విశ్వనాథ్‌రెడ్డి, మల్లికార్జున, అరటిపండ్ల చంద్ర, తదితరులు ఉన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: వన్నేదొడ్డి గ్రామ శివారులో శనివారం బైక్‌పై నుంచి పడి ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టపాడుకు చెందిన మనోజ్ గుత్తి మండలం కరిడికొండకు పని నిమిత్తం వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి క్రిష్టపాడుకు వెళ్తుండగా వన్నేదొడ్డిశివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

తాడిపత్రి అర్బన్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సెబ్ అధికారులు సీజ్ చేశారు. శనివారం తెల్లవారుజామున సెబ్ సీఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి బోగసముద్రం సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇసుక టిప్పర్ పట్టుబడింది. డ్రైవర్‌ను ఇమామ్‌హుసేన్‌ను అదుపులోకి తీసుకుని టిప్పర్‌ను సీజ్ చేసి తాడిపత్రి రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ తెలిపారు.

వాహనాల వేలం

గుత్తి: స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం వాహనాల వేలం నిర్వహించారు. రెండు బైకులకు రూ.25, 016 ఆదాయం వచ్చినట్లు పోలీసులు తెలిపారు. సీఐ వెంకటరామిరెడ్డి, సెబ్ సీఐ వరలక్ష్మి, ఎస్‌ఐ నబీరసూల్, అలీ పాల్గొన్నారు.

గార్లదిన్నె: పోలీస్‌స్టేషన్‌లో శనివారం వాహనాల వేలం జరిగింది.ఆటో, 4 బైక్‌లకు రూ.1,36,526 వచ్చినట్లు ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

గుత్తి రూరల్: బేతాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగుల దినోత్సవం, భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మహాలక్ష్మి ముందుగా బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. పాఠశాలలోని 12 మంది విద్యార్థులకు గుత్తికి చెందిన రాఘవేంద్ర బుక్ స్టాల్ యజమాని విద్యా సామగ్రి పంపిణీ చేశారు.